# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఈడీ, సిబిఐ పనిలో జోక్యం చేసుకునే అధికారం ప్రధానమంత్రికి సైతం లేదని నరేంద్రమోదీ అన్నారు.**

2. **ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బస్సుయాత్ర ఇవాళ విశాఖపట్నం నగరంలో సాగనుంది.**

3. **కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.**

4. **ఒకవైపు వడగాడ్పులు, మరోవైపు వర్షాలతో ఈ వారం దేశంలో మిశ్రమ వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ శాఖ తెలిపింది.**

5. **ఐపీఎల్ టోర్నీలో మరికాసేపట్లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు పోటీ పడనున్నాయి.**

==========================

ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్, సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను స్వేచ్ఛగా, స్వతంత్రంగా పనిచేయనివ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. వాటి పనితీరులో ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకోకూడదని నరేంద్రమోదీ చెప్పారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం అవుతున్నాయన్న ఆరోపణలపై ప్రధానమంత్రి స్పందిస్తూ...ఈడీ, సిబిఐ తమ పని తాము చేసుకుని పోతున్నాయన్నారు. ప్రధానమంత్రికి సైతం ఈడీ పనిలో జోక్యం చేసుకునే అధికారంలేదని నరేంద్రమోదీ చెప్పారు. నిజానికి ఈడీ, సీబీఐ తమ పని తాము చేయకపోతే వాటిని ప్రశ్నించాలనీ, కానీ ఆ సంస్థలు తమ పని తాము చేసుకుంటున్నందుకు ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదన్నారు.

---------------------------

వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన “మేమంతా సిద్ధం” బస్సు యాత్ర 20వ రోజు విశాఖ జిల్లాలో కొనసాగుతోంది. ఈరోజు చిన్నయపాలెం ప్రాంతం నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర పినగాడి జంక్షన్, లక్ష్మీపురం, వేపగుంట జంక్షన్, గోపాలపట్నం, ఎన్ఏడీ జంక్షన్, కంచరపాలెం, అక్కయ్యపాలెం, మద్దిలపాలెం, వెంకోజిపాలెం, హనుమంతువాక మీదుగా సాగుతుంది. ఎంవీవీ సిటీ ఎండాడ వద్ద ముఖ్యమంత్రి ఈ రాత్రికి బస చేస్తారు.

---------------------------

గత పదేళ్ళలో కర్నూలులో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. కర్నూలులో న్యాయరాజధాని ఏర్పాటు చేస్తామన్న హామీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలబెట్టుకోలేదన్నారు. కర్నూలులో ఈ ఉదయం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో షర్మిల ప్రసంగించారు. వైఎస్ఆర్ హయాంలో ప్రారంభించిన గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తిచేసి ఉంటే జిల్లాలో 2లక్షల ఎకరాలకు సాగునీరు, 6లక్షల మంది ప్రజలకు తాగునీరు అందిఉండేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి, అభివృద్ధి చేస్తుందని హామీ ఇచ్చారు.

-------------------------

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఈ సాయంత్రం 4 గంటలకు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోను, రాత్రి 7 గంటలకు భీమవరంలోను ఎన్నికల ప్రచార సభలు నిర్వహిస్తారు. నరసాపురం ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, నరసాపురం శాసనసభా స్థానానికి పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, భీమవరం అసెంబ్లీ సీటు నుంచి పోటీ చేస్తున్న పులపర్తి రామాంజనేయులు కోసం ఆయన ప్రచారం చేయనున్నారు.

-------------------------

జైన మత వ్యవస్థాపకుడు వర్ధమాన మహావీరుడి జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసారు. మహావీరుడి బోధనలను అనుసరించి సమస్త జీవుల సంక్షేమానికీ పాటుపడాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రజలకు విజ్ఞప్తి చేసారు. వర్ధమాన మహావీరుడు త్యాగం, సహానుభూతి, సున్నితత్వాలను ప్రబోధించాడని ఆమె గుర్తు చేసారు. మహావీరుడు బోధించిన సహనం, నైతిక ప్రవర్తన, అహింస వంటి సూత్రాలు ఈనాటి కాలానికి కూడా వర్తిస్తాయన్నారు. శాంతి, సౌహార్దం, సమృద్ధితో కూడిన సమాజాన్ని నిర్మించుకునే మార్గాన్ని మహావీరుడు మనకు చూపించాడని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన సందేశంలో పేర్కొన్నారు. మహావీరుడి బోధనలను స్ఫూర్తిగా తీసుకుని వికసిత భారతాన్ని నిర్మించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.

-------------------------

ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజు అయిన నేడు మోహినీ అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ ఉంటుంది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు గరుడసేవ నిర్వహిస్తారు. రేపు సీతారాముల కల్యాణం జరగనుంది.

-------------------------

దేశవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పశ్చిమబెంగాల్ నుంచి గంగామైదానం వరకూ వడగాడ్పులు కొనసాగుతున్నాయి. జార్ఖండ్, బిహార్‌లలో మరో మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్, కేరళ, మాహేలలో బుధవారం వరకూ తేమ కలిగిన వేడి వాతావరణం కొనసాగుతుందని వివరించింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో రాత్రివేళల్లో కూడా వాతావరణం వేడిగా ఉంటుందని తెలిపింది. మరోవైపు, ఈశాన్య రాష్ట్రాల్లోనూ, తూర్పు భారతదేశంలోనూ వర్షాలు పడే సూచనలున్నాయి. ఉత్తర భారతదేశంలోని

పలు ప్రాంతాల్లో సాధారణ వర్షపాతంతో పాటు మంచు కురిసే అవకాశం కూడా ఉంది. ఇక దేశ రాజధానిలో రేపు బలమైన గాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయి.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ముమ్మరంగా పాల్గొనేలా వారిలో చైతన్యాన్ని పెంచడానికి తిరుపతిలో ఈ ఉదయం బైక్ ర్యాలీ నిర్వహించారు. తిరుపతిలోని ఎంఆర్ పల్లి సర్కిల్ నుంచి లక్ష్మీపురం సర్కిల్ వరకూ నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆకాశవాణితో మాట్లాడుతూ....

**....వాయిస్ 34 సెకన్లు....**

---------------------------

మంగళగిరిని దేశంలోనే అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే లోకేష్ లక్ష్యమని నారా బ్రాహ్మణి అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు లోకేష్ తరఫున ఆయన భార్య బ్రాహ్మణి మంగళగిరి నియోజకవర్గంలోని బేతంపూడి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం-జనసేన-బిజెపి కూటమి అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆమె హామీ ఇచ్చారు.

---------------------------

రాష్ట్రంలో వడగాడ్పులు కొనసాగుతున్నాయి. ఈరోజు 45 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 197 మండలాల్లో వడగాడ్పులు, రేపు 70 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 116 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలియజేసింది.

రానున్న మూడురోజుల్లో  కొన్ని ప్రాంతాల్లో 43-46 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. పార్వతీపురం మన్యం, విజయనగరం, తూర్పు గోదావరి, కాకినాడ, గుంటూరు, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, శ్రీకాకుళం, వైఎస్సార్ జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల ప్రభావం ఉంటుందని వివరించింది.

మరోవైపు దక్షిణ కర్ణాటక నుంచి ఉత్తర తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి కారణంగా ఈరోజు, రేపు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం - ఐఎండీ తెలిపింది. అదే సమయంలో ఉక్కపోత, అసౌకర్య వాతావరణం కూడా కొనసాగుతుందని పేర్కొంది.

---------------------------

ఐపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఈరోజు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు కోల్‌కత్తాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌లో  కోల్‌కత్తా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలంజర్స్ బెంగుళూరుతో పోటీపడనుండగా... రాత్రి 7గంటల 30 నిమిషాలకు మొహాలిలో జరగనున్న మరో మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ జట్టుతో పోటీ పడుతుంది.

---------------------------

పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటర్ల క్యూలో వేచి ఉండకుండా వెంటనే ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించవలసిన మౌలిక వసతుల విషయమై ఆమె నిన్న టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు, వయోవృద్ధులు , ట్రాన్స్ జెండర్ ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ కల్పించాలని... వృద్ధుల కోసం చక్రాల కుర్చీలు, అంధుల కోసం బ్రెయిలీ భాషలో ఓటర్ స్లిప్పులు, ఇతర దివ్యాంగుల కోసం సహాయక కేంద్రాలను పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని వివరించారు.

-------------------------

ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా ప్రతీ వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుళ్ జిందాల్ స్థిర నిఘా బృందాలు (ఎస్ఎస్టి)లను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లాలో ఏర్పాటు చేసిన స్థిర నిఘా బృందాల చెక్‌పోస్టులను ఆయన పరిశీలించారు.

======================